


అక్రమాలకు కేరాఫ్ కేయూ!



ఆరోపణలు, వివాదాలకు కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ

- గాడి తప్పిన పాలనతో అంతా అస్తవ్యస్తం
- అనుబంధ అధ్యాపకుల నియామకం, ఆన్సర్‌షీట్ల స్కానింగ్ టెండర్లలో గోల్‌మాల్
- ఫార్మసీ కళాశాలలకు అనుమతుల్లోనూ నిబంధనలకు చెల్లుచీటీ
- పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలపై విద్యార్థుల ఆందోళన
- సీడ్‌మనీ పేరుతో ఫేక్ ప్రాజెక్టులతో నిధులు స్వాహా
- రిజిస్ట్రార్‌తో సహా అనేక నియామకాలపై వివాదం

ఎంతో ఘన చరిత్ర కలిగిన కాకతీయ యూనివర్సిటీ అక్రమాలు, వివాదాలకు కేరాఫ్‌గా మారిందా? యూనివర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా నియమాకాలు, నిధుల కేటాయింపులు జరుగుతున్నాయా? అడ్మిషన్లు మొదలు విద్యార్థుల ఆన్సర్ షీట్ల స్కానింగ్ టెండర్ల రద్దు వరకు అన్నీ అక్రమార్కుల కనుసన్నుల్లోనే జరుగుతున్నాయా? వీసీ, రిజిస్ట్రార్ నియామకంతో పాటు 16మంది అనుబంధ అధ్యాపకుల కొలువుల దాకా అన్నిటిలోనూ ఆరోపణలకు కేంద్రంగా విశ్వవిద్యాలయం మారిందా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానమే వినిపిస్తోంది. యూనివర్సిటీలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం దృష్టిసారించకపోవటంతో విద్యా ప్రమాణాలతో పాటు వర్సిటీ కీర్తిప్రతిష్టలు కూడా దెబ్బతింటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

ఏసీబీ కలకలం

లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా

స్థలం రిజిస్ట్రేషన్‌కు చదరపుగజానికి రూ.200 అదనంగా డిమాండ్

గత్యంతరం లేక ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు

సబ్‌రిజిస్ట్రార్‌కు సహకరించిన డేటాఎంట్రీ ఆపరేటర్ కూడా అదుపులోకి

మహబూబాబాద్, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : మానుకోటలో ఏసీబీ దాడులు కలకలం రేపాయి. బాధితుడిచ్చిన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు పథకం ప్రకారం కాపుకాసి.. జిల్లా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శుక్రవారం లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆమెతో పాటు ఆమెకు సహకరించిన ఔట్‌సోర్సింగ్ డేటాఎంట్రీ ఆపరేటర్ ఆలేటి వెంకట్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం. దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన రైతు గుండగాని హరీష్ దంతాలపల్లి మండలకేంద్రంలో 128 గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ భూమి రిజిస్ట్రేషన్ కోసం ఈనెల మొదటి వారంలో సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌ను సంప్రదించారు. అయితే రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వ లెక్కల ప్రకారం ఫీజుకింద చదరపు గజానికి ప్రకారం రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉండగా.. దాంతో పాటు అదనంగా గజానికి రూ.200ఇవ్వాలని సబ్‌రిజిస్ట్రార్ అయన్ను డిమాండ్ చేశారు. ఈ క్రమంలో గజానికి రూ.150 అదనంగా ఇచ్చేందుకు హరీష్ అంగీకరించాడు. కానీ, అందుకు సబ్‌రిజిస్ట్రార్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు గజానికి రూ.200చొప్పున ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో గత్యంతరలేని పరిస్థితుల్లో బాధితుడు వరంగల్‌లోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆ తర్వాత పథకం ప్రకారం మరోసారి సబ్‌రిజిస్ట్రార్‌తో మాట్లాడిన హరీష్.. తాను గజానికి రూ.150 చొప్పున 128 గజాలకు రూ.19200 అదనంగా చెల్లిస్తానని అంగీకారం కుదుర్చుకున్నాడు. ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయాలని, డబ్బు తెచ్చానని చెప్పగా.. ఆ నగదును డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకట్‌కు అందించాలని తస్లీమా సూచించారు. ఆమె చెప్పినట్టుగా నగదును ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకట్ అలియాస్ ఆలేటి వెంకటేశ్వర్లుకు ఇస్తుండగా అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి హరీష్ ఇచ్చిన రూ.19,200తో పాటు అంతకుముందు శుక్రవారం రోజంతా ఇతరుల నుంచి లంచాల రూపంలో వసూలు చేసిన (అన్‌అకౌంట్ మనీ) రూ.1.72 లక్షలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌తోపాటు ఆమెకు సహకరించిన వెంకటేశ్వర్లును అరెస్టు చేశారు. వారిని శనివారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈదాడుల్లో సీఐలు శ్యాంసుందర్, సునీల్‌కుమార్, రాజు పాల్గొన్నారు. మొత్తంగా ఏసీబీ దాడుల్లో తస్లీమా పట్టుబటడం జిల్లా వ్యాప్తంగా, అధికార వర్గాల్లో తీవ్ర కలవరం రేపింది. అయితే తాను కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో దంతాలపల్లి మండల కేంద్రంలో ఇటీవలే 128 గజాల ఇంటి స్థలాన్ని కొని రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే ప్రభుత్వానికి చెల్లించే ఫీజుతో పాటు అదనంగా డబ్బులు అడగడంతో ఏసీబీని ఆశ్రయించాని హరీష్ తెలిపారు. మరెవరికి ఇలా జరుగవద్దనే ధైర్యం చేశానన్నారు.

సామాజిక సేవా కార్యకర్తగా..

కొన్నేళ్లుగా సామాజిక సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ములుగు జిల్లా సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాలం నుంచి అనేక సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విపత్కర సమయాల్లో గిరిజనులకు సాయమందిచడంలో ముందుండేవారన్న పేరుంది.కోవిడ్ విపత్కర సమయంలో ములుగు ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సీతక్కతో కలిసి కొండలు, గుట్టలు దాటి గిరిజనగూడేల్లోకి వెళ్లి నిత్యావసరాల పంపిణీతో పాటు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించడం, ఆ దృశ్యాలు సోషల్‌మీడియా ద్వారా ప్రజల్లోకి వెళ్లడంతో తస్లీమా అందరి ప్రశంసలు అందుకున్నారు. ఇలా సామాజిక సేవా గుణం ఉన్న ఆమె లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది.

మరమ్మతులేవీ?



డోర్నకల్ వద్ద కొట్టుకుపోయిన మున్నేరు కరకట్ట

- మరో మూడునెలల్లో వానాకాలం
- పట్టించుకోని నీటిపారుదల శాఖ
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు



కొట్టుకుపోయిన కరకట్ట

గతేడాది వరదలకు కొట్టుకుపోయిన 'మున్నేరు' కరకట్టలు, ధ్వంసమైన ఫ్లడ్‌బ్యాంక్‌లు

డోర్నకల్, మార్చి 22 : అన్నదాతలకు కష్టాలు వెన్నంటే ఉంటాయి. అతివృష్టి, అనావృష్టి ఏది సంభవించినా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో భారీ వరదలు కోలుకోకుండా చేస్తున్నాయి. ఇందులో భాగంగానే డోర్నకల్ మండలం గుండా ప్రవహించే మున్నేరు నదిపై నిర్మించిన కరకట్టలు గతేడాది వచ్చిన భారీ వరద లకు పూర్తిగా కొట్టుకుపోయాయి. వాటి మరమ్మతులు చేపట్టాలని రైతులు ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికి పట్టించుకున్న పాపానపోలేదు. ఈ నేపథ్యంలో వచ్చే వానాకాలం సీజన్‌లో మళ్లీ వదర పొటెత్తితే, సాగుచేసే తమపొలాలు కొట్టుకుపోయి ఆర్థికంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు.

డోర్నకల్ మండలం మీదుగా

డోర్నకల్ మండలం మీదుగా ప్రవహించే మున్నేరు నది కృష్ణానదికి ఓ ప్రధాన ఉపనది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కృష్ణ పరివాహక ప్రాంతం పరిధిలో మున్నేరు నది ఉంది. మున్నేరు క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసే వర్షం వల్ల వచ్చే వరద నీరు మొత్తం కూడా కృష్ణా నదికే చేరుతుంది. ప్రతీ ఏడాది నుంచి జూలై నుంచి డిసెంబర్ వరకు మున్నేరుకు నీటి ప్రవాహం కొనసాగుతూ ఉంటుంది. డోర్నకల్ నుంచి ఎగువ ప్రాంతాలైన గార్ల, బయ్యారం, మహబూబాబాద్, కేసముద్రం, నల్లబెల్లి, గూడూరు, నర్సంపేట, కొత్తగూడ, చెన్నారావుపేట తదితర మండలాల నుంచి వచ్చే వాగులు.. వంకలతో పాటు చెరువుల, కుం టల అలుగునీరు మొత్తం మున్నేరుకే చేరుతోంది.

పట్టించుకోని అధికారులు..

డోర్నకల్ మండలంలో మున్నేరుపై గత ఐదు సంవత్సరాల్లో ఆరు చెక్‌డ్యాంలు నిర్మించారు. ఈ డ్యాంలు నిర్మించిన చోట నదికి ఇరు వైపులు అధికారులు కరకట్టలు (ఫ్లడ్ బ్యాంక్‌లు) ఏర్పాటు చేశారు. వాటికి రాయితో రివిట్‌మెంట్ చేసి, పటిష్టం చేశారు. అయితే గతేడాది జూలై చివరి వారంలో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో మున్నేరుకు వరద పొటెత్తింది. ఈ వరద ఉధృతికి చెక్‌డ్యాంల వద్ద నిర్మించిన కరకట్టలు కొట్టుకుపోయాయి. నీటి పారుదల శాఖ ఇంజనీర్‌లు వాటిని పరిశీలించి మరమ్మతులు చేపడుతామని చెప్పారు. కానీ, ఎనిమిది నెలలు అయినప్పటికి కరకట్టల మరమ్మతులను పట్టించుకోలేదు.

వరద ప్రవాహాన్ని అంచనా వేయడంలో విఫలం..

డోర్నకల్ సమీపంలో నైజాం ప్రభుత్వ కాలంలో నిర్మించి న చెక్‌డ్యాంకు ఏర్పాటు చేసిన కరకట్టలు 70 ఏళ్ల పాటు చెక్కు చెదరకుండా ఉన్నాయి. అయితే 2005 సెప్టెంబర్‌లో మున్నేరుకు కనీవినీ ఎరుగనిస్థాయిలో వరద పోటెత్తడంతో అవి కూడా కొట్టుకుపోయాయి. దాదాపు సుమారు 2 లక్షల క్యూసెక్కులకు పైగా వరద రావడంతో, అ కరకట్టలు కొట్టుకుపోయాయి. దీంతో డోర్నకల్ మండలంలోని ఉమ్మడి గొల్లచర్ల, ఉయ్యాలవాడ, అమ్మపాలెం, వెన్నారం, డోర్నకల్ రెవెన్యూ పరిధిలోని వందలాది ఎకరాల వరిపంట వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో సుమారు 400మంది రైతులు ఆర్థికంగా నష్టపోయారు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన కరకట్టలను తిరిగి నిర్మించారు. తర్వాత వాటి నిర్వహణను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో అవి బలహీనమయ్యాయి. 2005లో వచ్చిన వరదను అధికారులు ప్రామాణికంగా తీసుకుని తర్వాతి కాలంలో నిర్మించిన చెక్‌డ్యాం, ఫ్లడ్‌బ్యాంక్‌లను నిర్మిస్తే కరకట్టలు కొట్టుకుయి ఉండేవి కావని రైతులు బలంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు 2లక్షల క్యూసెక్కుల వరద ప్రవహం తట్టుకునే విధంగా కరకట్టలను నిర్మించాలని కోరుతున్నారు.

మరమ్మతులు మరిచిన నీటిపారుదలశాఖ

గతేడాది జూలైలో మున్నేరుకు వరద ఉధృతికి కరకట్టలు కొట్టుకుపోవడంతో మున్నేరు నది ప్రవాహ దిశను మార్చుకుని రైతుల పొలాల మీదుగా వరద నీరు ప్రవహించింది. దీంతో పొలాల్లో ఉన్న మట్టిమొత్తం కొట్టుకుపోయి వాటిలో గుంతలు, గండ్లు ఏర్పడ్డాయి. వరద ప్రవహానికి మట్టి కొట్టుకుపోవడంతో పొలాల్లో రాళ్ల పైకి తేలాయి. పొలాలు సాగుకు పనికిరాకుండా పోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు కొట్టుకుపోయిన కరకట్టల ప్రాంతాన్ని పరిశీలించారు. నవంబర్‌లో మరమ్మతులు చేపడుతామని అన్నారు. ఈలోగా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు.

రూ.20 కోట్లతో అంచనాలు తయారు..

వరద నీటితో కొట్టుకుపోయిన కరకట్టల మరమ్మతులు చేపట్టడానికి రూ.20 కోట్లతో సంబంధిత అధికారులు అంచనాలు తయారు చేసి, నివేదికను ప్రభుత్వానికి పంపించారు. ఇంత వరకు వాటికి పరిపాలన, సాంకేతిక అనుమతులు కూడా లభించలేదు. రెండు అనుమతులు వచ్చిన తర్వాతనే టెండర్లు పిలుస్తారు. ఇప్పటికి మార్చి నెల గడుస్తున్నా.. టెండర్లు పిలువలేదు. వర్షాకాలం మరో మూడునెలలు ఉంది. మున్నేరు పరివాహక ప్రాంతాల్లోని రైతులు ఆయా పొలాల్లో వరి పంటను సాగు చేయనున్నారు. ఎగువప్రాంతాల్లో కురిసే వర్షానికి మున్నేరు వాగుకు వరద ఉధృతి పెరిగి తాము సాగుచేసిన పంట పొలాలు కొట్టుకుపోయి తాము ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలానికి మూడు మాసాలు సమయం ఉండడంతో ఈలోగా ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు మున్నేరు వద్ద కరకట్టలు నిర్మించి తమను ఆదుకోవాలని ఆయా ఆయకట్టు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



మున్నేరు నది వద్ద కరకట్టలు నిర్మించాలి

బానోత్ బాలాజీ, మున్నేరు పరివాహక రైతు, చాంప్లాతండా డోర్నకల్

గతేడాది వచ్చిన వరదలకు నాకున్న రెండెకరాల్లో వరి పూర్తి కొట్టుకుపోయి.. భూమిలో రాళ్ల, గోతులు ఏర్పడ్డాయి. దీంతో తాను బాగానే నష్టపోయాను. అప్పట్నుంచి పొలంలో సాగు చేయలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మున్నేరు నదివద్ద కరకట్టలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.



కరకట్టలకు మరమ్మతులు చేపడుతాం

సామ్రాజ్, ఏఈ, ఇరగేషన్ శాఖ, డోర్నకల్

గతేడాది జూలైలో కురిసిన వర్షాలతో మున్నేరుకు వరద ప్రవాహం పోటెత్తింది. దీంతో కరకట్టలు కొట్టుకుపోయాయి. వాటి మరమ్మతుల కోసం ప్రభుత్వానికి రూ. 20 కోట్లు ఎస్టిమేషన్ వేసి నివేదికను అందించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే మున్నేరు నది వద్ద కరకట్టల పనులు చేపడుతాం.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్
- మరిపెడలో పోలీస్ కవాత్



మరిపెడ విశ్రాంతి భవనం దగ్గర మానవహారం నిర్వహిస్తున్న బీఎస్‌ఎఫ్ బలగాలు, సివిల్ పోలీసులు

మరిపెడ, మార్చి22 : ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అన్నారు. శుక్రవారం మరిపెడలో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా బీఎస్‌ఎఫ్ బలగాలు, సివిల్ పోలీసులు భారీ కవాత్ జరిపి, ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం దగ్గర మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా భారీ బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. చట్టానికి ఎవ్వరు చుట్టాలు కాదని హెచ్చరించారు. ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్పీ చెన్నయ్య, తొర్రూరు డీఎస్పీ సురేశ్, ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ సైదులు, సీఐ హతిరాం, ఎస్సై తహెర్ జిల్లాలోని పలువురు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, బీఎస్‌ఎఫ్ బలగాలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నిషేధిత దందాలపై నిఘా పెంచాలి..

నర్సింహులపేట : ప్రభుత్వ నిషేధిత వ్యాపారాలపై ప్రత్యేక నిఘాను పెంచి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా పోలీస్ అధికారి సుధీర్‌రాయ్‌నాథ్ అన్నారు. నర్సింహులపేట ఠాణాను ఆకస్మికంగా సందర్శించి, సీజ్‌చేసిన వాహనాలను, పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను, రికార్డులను పరిశీలించారు. ఠాణాలో ఏర్పాటు చేసిన రోడ్ మ్యాప్ వివరాలను ఎస్‌హెచ్‌వో సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ సిబ్బంది కృషి చేయాలన్నారు. గాంజా, నల్లబెల్లం, పటిక, కొకైన్‌లాంటి నిషేధిత వ్యాపారాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమం లో ఏఎస్పీ చెన్నయ్య, తొర్రూరు డీఎస్పీ సురేష్, సీఐ సంజీవ, ఎస్‌హెచ్‌వో జి.సతీష్, సిబ్బంది ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

చిన్నగూడూరు : పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. చిన్నగూడూరు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి, మండల స్వరూపాన్ని మ్యాప్‌లో తెలుసుకున్నారు. అనంతరం గుండంరాజుపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేసే ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన భద్రత చర్యలపై ఎస్సై ఝూన్సీ సీఐ హతీరాంకు తగు సూచనలు చేశారు. వారివెంట డీఎస్పీ సురేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు

ఇద్దరు పిల్లలను బావిలోకి తోసేసి.. తానూ దూకిన తల్లి

- తల్లీకూతురు మృతి.. కుమారుడు సురక్షితం
- వెంకటాపురంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఘటన



మృతి చెందిన లావణ్య, నిత్యశ్రీ

నెల్లికుదురు, మార్చి 22 : కుటుంబ కలహాల కారణంగా తన ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఓ తల్లి ఆత్మహత్యాయత్నం చేయగా.. ఆమెతో పాటు కూతరు మృతిచెందగా.. కుమారుడు సురక్షితంగా బయటపడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామ శివారు వెంకటాపురంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలివీ... వెంకటాపురానికి చెందిన ఆకుల లావణ్య (28), ఆమె భర్త మురళి కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. శుక్రవారం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో లావణ్య క్షణికావేశంలో పదేళ్ల కుమారుడు ముఖేష్, కూతురు నిత్యశ్రీ(6)ని తీసుకుని గ్రామంలోని మంచినీటి బావి వద్దకు వెళ్లింది. తొలుత పిల్లలిద్దరిరీ బావిలోకి తోసేసిన లావణ్య.. ఆ తర్వాత తానూ దూకింది. గమనించిన గ్రామస్థులు బావిలో నుంచి ముగ్గురినీ బయటకు తీయగా.. లావణ్యతోపాటు ఆమె కూతురు నిత్యశ్రీ అప్పటికే మృతిచెందగా, ముకేష్ ప్రాణాలతో బయటపడ్డారు. అయితే ఈ ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉండగా.. తొర్రూరు డీఎస్పీ సురేష్, ఎస్సై క్రాంతికిరణ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

సీపీఎస్ అంతమయ్యే వరకూ పోరాడాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి

మహబూబాబాద్ టౌన్, మార్చి 22 : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, అమరజీవి అప్పారి వెంకటస్వామి (ఏవీఎస్) పోరాట స్ఫూర్తితో సీపీఎస్ అంతమయ్యే వరకు పోరాడాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో ఏవీఎస్ వర్ధంతిని పురస్కరించుకుని యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారంఆయన చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన 16 సంవత్సరాల సర్వీసును త్యాగం చేసి కోర్టుకు వెళ్లి రాష్ట్ర వ్యాప్తంగా సంఘాన్ని పెట్టి హక్కులు సాధించిన ఏవీఎస్ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం ఉద్యోగ ఉపాధ్యాయులకు శాపంగా మారిన కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసుకుని పాత పెన్షన్ విధానాన్ని సాధించుకోవడానికి, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలని కోరారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఆవారి శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ షేక్.యాకూబ్, స్వప్న, మంజుల, హుస్సేన్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, తిరుపతి, సౌభాగ్య, హరినాయక్, వెంకట్, రాజయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో సంత నిర్వహించవద్దు

- తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి

దంతాలపల్లి, మార్చి22 : ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై దంతాలపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో వారంతపు సంతను నిర్వహించవద్దని శుక్రవారం తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి స్థానిక పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్‌ను సూచించారు. ఈ సందర్భంగా ఆమె వారంతపు సంతను బస్టాండ్‌లో నిర్వహిస్తున్నారంటూ ఫిర్యాదు రావడం తో, సందర్శించారు. ఇక నుంచి ఆర్టీసీ బస్సులు తప్పక బస్టాండ్‌లోనే ఆగుతాయని అన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు అంబేద్కర్ సెంటర్‌లో వేచి ఉండొద్దని అన్నారు. నేరు గా బస్సులు ఆగే చోటుకు ప్రయాణికులు రావాలన్నారు. వారంతపు సంత నిర్వహణపై ఎమ్మెల్యే రాంచంద్రనాయక్‌తో డిపో మేనేజర్ ఫోన్లో మాట్లాడారు. ఆర్టీసీ సేవలు మండల ప్రజలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారని డిపో మేనేజర్ వెల్లడించారు. ఎంపీటీసీ యాకన్న, ట్రాఫిక్ మేనేజర్ రజితరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కటాక్షపూర్‌లోని చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

చెక్‌పోస్టు తనిఖీ చేసిన సీపీ

వరంగల్ క్రైం, మార్చి22: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ఆత్మకూరు మండలం కటాక్షపూర్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది నిర్వహిస్తున్న తనిఖీ తీరును సీపీ పరిశీలించారు. తనిఖీ సమయంలో ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని ఆయన సూచించారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సీపీతో ఆత్మకూరు సీఐ క్రాంతికుమార్ ఉన్నారు.

ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, మార్చి 22: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డు బంద్ సెలవు, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం హోలీ పండుగను పురస్కరించుకుని సెలవు ప్రకటించారు. తిరిగి మంగళవారం మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ కార్యదర్శి ఆ ప్రకటనలో తెలిపారు.

వరంగల్ మార్కెట్లో తగ్గిన పంటల ధరలు

వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో వివిధ పంట సరకులకు గురువారంతో పోలిస్తే శుక్రవారం మరిం త తగ్గాయి. పతి క్వింటాకు రూ.7,315 శుక్రవారం రూ. 7,250 పలికింది. సింగిల్‌పట్టి మిర్చి క్వింటాకు రూ.45,600 లకు రూ.42వేలు పలికింది. తేజా రూ.19,800లకు రూ. 19,300, వండర్‌హాట్ రూ.15,500లకు రూ.15వేలు, యుఎస్ 341 రకం రూ.16,500లకు రూ.15వేలు ధర పలికింది. అలా గే, దీపిక రూ.14వేలు పలికింది. దేశీ రకం రూ.34వేలకు రూ.30వేలు, తాలు రూ.8వేలకు రూ.8,500 ధర పలికింది.

అక్రమాలకు కేరాఫ్ కేయూ!

ఆరోపణలు, వివాదాలకు కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ



(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తన చదువులమ్మ చెట్టు నీడలో ఎందరినో మహానుభావులుగా తీర్చిదిద్దిన కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ఠ దిగజారుతోంది. యూనివర్సిటీ నిర్వహణ వ్యవహారాల గురించి గత ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవటంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, ఫలితంగా అనేక అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. తాజా వెలుగులోకి వచ్చిన పలు అక్రమాలతో ఇదంతా వాస్తవమేనన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం అన్సర్ షీట్ స్కానింగ్ టెండర్ల రద్దు, రీటెండర్ వ్యవహారం దుమారం రేపుతోంది. కాకతీయ యూనివర్సిటీలో 32పేజీలు ఉండే యూజీ, పీజీ పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలను స్కానింగ్ చేయటం కోసం ఫిబ్రవరి 2వ తేదీన ఈ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. టెండర్ బిడ్ సమర్పించడానికి మార్చి6 వరకు గడువు విధించారు. ఇలా వచ్చిన దరఖాస్తుల టెక్నికల్ బిడ్‌ను మార్చి 7న, కమర్షియల్ బిడ్‌ను 13వ తేదీన ఓపెన్ చేయాల్సి ఉంది. ఈ స్కానింగ్ టెండర్‌కు మూడు కంపెనీలు బిడ్ దాఖలు చేయగా.. అందులో కోజీన్ లిమిటెడ్ కంపెనీ మిగతా రెండింటి కంటే తక్కువగా ఒక ఆన్సర్ షీట్ డిజిటలైజేషన్‌కు రూ.14.51కు కోట్‌చేసింది. నిబంధనల ప్రకారం టెండర్‌ను కోజీన్ కంపెనీకి ఇవ్వాల్సి ఉంది. కానీ, అనుహ్యంగా కేయూ వీసీ ఆ టెండర్‌ను రద్దు చేసి మళ్లీ ఈ నెల 16న రీటెండర్‌కు నోటిఫికేషన్ జారీ చేయటం వివాదాస్పదమైంది. పాత టెండర్‌ను ఎందుకు రద్దు చేశారో చెప్పకుండా రీ టెండర్ నోటిఫికేషన్ వేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలమైన కంపెనీకి టెండర్ దక్కకపోవటంతోనే రద్దు నిర్ణయం తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి నిబంధనల ప్రకారం రూ.5లక్షల దాటే ఏ పనికైనా తప్పనిసరిగా టెండర్లు ఆహ్వానించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వంలో మూడేళ్లుగా ఎలాంటి టెండర్లు లేకుండా ఆన్సర్ షీట్ స్కానింగ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత టెండర్లపై దృష్టిపెట్టడంతో రూ.2కోట్లతో చేపట్టే ఆన్సర్ షీట్ల స్కానింగ్ పనులకు ఈసారి టెండర్లు పిలిచి, వాటిని ఆకారణంగా రద్దు చేసిన కేయూ అధికారుల నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఈ టెండర్ రద్దుపై పలువురు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కేయూ వీసీ, రిజిస్ట్రార్‌లపై ఫిర్యాదు చేయటం కలకలం రేపుతోంది.

ఆధ్యాపకుల నియమాకంలో అక్రమాలే..

కేయూలో ఇటీవల నియమించిన అనుబంధ అధ్యాపకుల(అడ్జంట్ ఫ్యాకల్టీ)ను నిబంధనలకు విరుద్ధంగా నియమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూజీసీ నిబంధనల ప్రకారం అడ్జంట్ ఫ్యాకల్టీ నియమకానికి ముందస్తుగా నోటిఫికేషన్ ఇవ్వాలని, వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధిపతులు పరిశీలించి రిజిస్ట్రార్‌కు పంపించాల్సి ఉంటుందని యూనివర్సిటీ అధ్యాపకులు పేర్కొంటున్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న వారి నుంచి అధ్యాపకులను ఎంపిక చేసేందుకు ఐదుగురితో కూడిన సెలక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదనే విమర్శలున్నాయి. సెలక్షన్ కమిటీ లేకుండా కేయూలో గతేడాది జనవరి 30న 12 మందిని, మార్చిలో నలుగురిని కలిపి మొత్తం 16 మందిని పాలక మండలి అనుబంధ అధ్యాపకులుగా నియమించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. 2014 సెప్టెంబరులో ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలో ఎలాంటి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకూడదని ఆదేశాలున్నా యూనివర్సిటీ అధికారులు పట్టించుకోకుండా నియామకాలు చేశారని, వీరి కి ఒక్కొక్కరికి నెలకు రూ.50వేల చొప్పున 16మంది కి ప్రతినెల రూ.8లక్షల వేతనాలు చెల్లిస్తున్నారని, అయితే ఇప్పటి వరకు వీరు ఎలాంటి పరిశోధనలు చేయడం లేదని, క్లాసులు తీసుకోవటం లేదని, దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫామ్-డి అనుమతిలో నిబంధలు బేఖాతరు

ఫార్మసీ కాలేజీలకు అనుమతుల్లోనూ కేయూ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేయూ పరిధిలో మొత్తం 24 ఫార్మసీ కాలేజీలుండగా వీటిలో బీఫార్మసీ, ఎంఫార్మసీ కోర్సులున్నాయి. అయితే 12కాలేజీలు డీఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతులు కోరుతూ యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే ఫామ్-డి కోర్సు నిర్వహించే కాలేజీలకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి పొందిన 300 పడకల ఆస్పత్రులు అనుబంధంగా ఉండాలి. కానీ దరఖాస్తు చేసుకున్న 12కాలేజీల్లో.. కేర్ ఫార్మసీ, సహస్ర ఫార్మసీ, వాగ్దేవీ హనుమకొండ, సెయింట్ పీటర్, తాళ్ల పద్మావతి కాలేజీ, ఖమ్మం ఫార్మసీకాలేజీలు మాత్రమే 300 పడకల ఆస్పత్రులను అనుబంధంగా కలిగి ఉన్నాయి. మిగతా ఆరు కాలేజీలకు ఎలాంటి అనుబంధ వైద్యశాలలు లేకపోయినా యూనివర్సిటీ అధికారులు అనుమతులు ఇచ్చారు. కేయూ అధికారుల తమకు అనుకూలమైన వారిని తనఖీలకు పంపించి, తప్పుడు నివేదికల ఆధారంగా ఆ కళాశాలలకు అనుమతులిచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు

పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలతో కేయూ పరువు బజారుకెక్కింది. 2017లో పీహెచ్‌డీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు ఆరేళ్ల పాటు పట్టించుకోలే దు. విద్యార్థుల ఆందోళనలతో దిగివచ్చిన కేయూ అధికారు లు 2023లో అడ్మిషన్లకు షెడ్యూల్ ప్రకటించింది. పీహెచ్‌డీ అడ్మిషన్లలో 75శాతం రెగ్యులర్ ప్రాతిపదికన, 25శాతం పార్ట్ టైం ప్రాతిపదికన కేటాయించారు. మే 27, 2022లో కేటగిరి-1 ఇంటర్వ్యూలు నిర్వహించి.. అదే ఏడాది మార్చి 21న కేటగిరి-2లో సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టు 29న ఫలితాలు వెల్లడించారు. అయితే ఇంటర్వ్యూలో అధికారులు నిబంధనలు పాటించలేదని, అవకతవకలకు పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపిస్తూ గత సెప్టెంబరులో ఆందోళనకు దిగా రు. కేటగిరి-2 అడ్మిషన్లలో కొందరు ప్రొఫెసర్లు సీట్లు అమ్ముకున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగగా పదిమంది విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేసి ఇద్దరిని జైలుకు పంపించారు. దీనిపై విద్యార్థులు అప్పటి గవర్నర్ తమిళిసైను కూడా కలిసి పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు చేశారు. దీనిపై కొత్త ప్రభుత్వం ఫిబ్రవరి 16న త్రిసభ్య కమిటీని వేసింది. కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలను వెలికి తీసేందుకు ఆ త్రిసభ్య కమిటీ సభ్యులు కేయూలో పర్యటించి వీసీ, రిజిస్ట్రార్‌లతో పాటు ఆధ్యాపకులు, విభాగాల అధిపతులు, విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. అయితే గత బుధవారం త్రిసభ్య కమిటీ నివేదిక ఇచ్చినా అందులో ఏముందో యూనివర్సిటీ అధికారులు బయట పెట్టకపోడంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కాగా, వీటితో పాటు కేయూలో ఆరుగురు ప్రొఫెసర్లతో కలిసి సీడ్‌మనీ పేరుతో నకిలీ పరిశోధన ప్రాజెక్టులు మంజూరు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎలాంటి పరిశోధనలు చేయకుండా రూ.20లక్షల నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ల, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే చర్చ జరుగుతోంది. రిజిస్ట్రార్, వీసీ నియామకాలతో పాటు పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకాలపై వివాదం కొనసాగుతుండగా.. ఇప్పటికే ప్రభుత్వం యూనివర్సిటీపై దృష్టిసారించి ప్రత్యేక విచారణ కమిటీలు, విజిలెన్స్ విచారణకు కూడా ఆదేశించింది. కేయూలో జరుగుతున్న అవతవకలపై అకుట్ ఆధ్వర్యంలో అనేకమార్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసింది. మొత్తం మీద రాష్ట్రంలో రెండో అతి పెద్ద యూనివర్సిటీగా ఉన్న కేయూలో కొంతకాలంగా వస్తున్న అక్రమాల ఆరోపణలు, విద్యార్థులు, ఆధ్యాపకుల ఆందోళనలతో ప్రతిష్ఠ మసకబారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్‌లో గడువు తీరిన ఔషధాల విక్రయం

వరంగల్ మెడికల్, మార్చి 22: రోగికి గడువు తీరిన ఔషధాలు విక్రయించిన ఘటనపై వరంగల్ ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని శ్రీ సృష్టి హాస్పిటల్ వైద్యురాలు దొడ్డ సంధ్య దగ్గరకు లలిత అనే గర్భిణీ పరీక్ష నిమిత్తం ఈ నెల 18న వెళ్లింది. వైద్యురాలు గర్భిణీకి పరీక్ష నిర్వహించి పోల్‌విస్ట్-డీహెచ్‌ఏ మా త్రలు రాసింది. ఇదే హాస్పిటల్ ఆవరణలోని తిరుమల ఫార్మసీలో మందులు కొనుగోలు చేశారు. ఎక్స్‌పైరీ తేదీ దగ్గర కట్ చేసి నాలుగు షీట్స్ విక్రయించారని రోగి భర్త ఎం.మహేశ్ ఫిర్యాదు చేశారు. వరంగల్ ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఈ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మందుల విక్రయాలపై డీఎంఈ ఆరా

వరంగల్ మెడికల్, మార్చి 22: ప్రాంతీయ ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఫార్మసిస్టు మందులను ప్రయివేట్ వ్యక్తులకు విక్రయించిన ఘటనపై వైద్య విద్య డైరెక్టర్ తీవ్రంగా స్పందించారు. ఆర్‌ఈహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్‌రెడ్డి సెలవులో ఉండటంతో ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ వెంటనే విచారణ జరపాలని ఆదేశించారు. ఈ ఆదేశాలతో శుక్రవారం ఉదయం డాక్టర్ చంద్రశేఖర్ ఆర్‌ఈహెచ్‌ను సందర్శించారు. మందులు బయటికి తరలివెళ్లిన విషయాలపై ఆరా తీశారు. సమగ్ర నివేదికను డీఎంఈకి పంపనున్నారు. కాగా, ఎఫ్‌ఐఆర్ కాపీ అందించిన వెంటనే ఫార్మసిస్టు తలకోటి నాగేందర్‌ను సస్పెండ్ చేయనున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

ఏప్రిల్ 1 నుంచి దివ్యాంగుల ప్యాసింజర్ వాహనాల రాయితీ రద్దు

వరంగల్ చౌరస్తా, మార్చి 22: డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఆదేశానుసారం జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా అమలు చేయబడుతున్న టీ-ప్రైడ్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు ప్యాసింజర్ వాహనాలకు కల్పించే రాయితీ ఏప్రిల్ 1 నుంచి రద్దు చేయబడిందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శుక్రవారం నర్సింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన రాయితీలు యథావిధిగా అమల్లో ఉంటాయన్నారు. రద్దు చేయబడిన లబ్ధిదారులు ఆ రాయితీని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా పొందవచ్చని ఈ మార్పును లబ్ధిదారులు గమనించాలని నర్సింహమూర్తి తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, మార్చి22: గీసుగొండ మండలంలోని రెడ్డిపాలెం, హసన్‌పర్తి మండలంలోని ఎల్లాపూర్‌లో బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో రెడ్డిపాలెంలో రూ.61,210, ఎల్లాపూర్‌లో రూ.5100 అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూధన్ ధృవీకరించారు.

అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఎం రేవంత్ రెడ్డికి అర్చక ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి



సీఎంను కలిసి సమస్యలను నివేదిస్తున్న అర్చక ఉద్యోగుల జేఏసీ నాయకులు

హనుమకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అర్చక ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలన్నిటినీ పరిష్కరించాలని అర్చక ఉద్యోగుల జేఏసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభ్యర్థించింది. శుక్రవారం అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ నేతృత్వంలో అర్చకులు సీఎంను హైదరాబాద్‌లోని ఆయన నివాసగృహంలో కలిశారు. అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా జీవో నెంబరు 577 ప్రకారం అర్చక ఉద్యోగులందరికీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,627 మందికి వేతనాలు చెల్లించాల్సి ఉండగా, దేవాదాయ అధికారుల నిర్లక్ష్యంవల్ల ప్రస్తుతం మూడు వేల మందికి మాత్రమే వస్తున్నాయని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. మిగతా వారికి కూడా వచ్చేట్టు తగిన చర్యలు తీసుకోవలసిందిగా వారు కోరారు. 121 జీవో తొలగించడంవల్ల పూర్తిస్థాయిలో అందరికీ గ్రాంట్ ఎయిడ్ ద్వారా వేతనాలు వస్తాయని తెలిపారు. రెండేళ్లుగా దేవాదాయ శాఖలో కారుణ్య నియామకాలు లేవని తెలిపారు. 200మంది అర్చక ఉద్యోగుల పిల్లలను కారుణ్య నియామకాల ద్వారా నియమించాలని కోరారు. అర్చక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినా అర్చక ఉద్యోగులకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రతీ అర్చక ఉద్యోగికి ఆరోగ్య బీమా వర్తింప చేయాలని సీఎంను అభ్యర్థించారు. రిటైరైన ఉద్యోగులకు రూ.10లక్షల చొప్పున గ్రాట్యుటీ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రతీనెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, గ్రామీణప్రాంత ధూప, దీప, నైవేద్య అర్చకులకు ఉద్యోగభద్రత కల్పించాలని, వారి గౌరవ వేతనాన్ని రూ.25వేలకు పెంచాలని, ధార్మిక భావన కలిగిన వారిని దేవాలయ ధర్మకర్తల మండలిలో నియమించాలని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. వెంటనే ఓఎస్‌డీని పిలిచి అర్చక ఉద్యోగుల సమస్యలపై రెండు రోజుల్లో నివేదిక అందచేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు క్రిష్ణమాచారి, పరాశరం రవీంద్రాచారి, అర్చక జేఏసీ కన్వీనర్ అగ్నిహోత్రం చంద్రశేఖర్ శర్మ, కర్మాఘాట్ దేవాలయం అర్చకులు అంబా ప్రసాద్ శర్మ, సంతోష్ కుమారాచార్యులు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండారి జగపతి, ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెన్నా మోహన శర్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు.. ఒకరికి గాయాలు

హనుమకొండ టౌన్, మార్చి 22 : హనుమకొండ కేయూ రోడ్డులోని గోపాల్‌రావు బిల్డింగ్ ఏరియాలో ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనదారుడు యూ టర్న్ తీసుకుంటుండగా కారు ఢీకొని గాయపడ్డ ఘటన ఈ నెల 11న చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వికాస్‌నగర్‌కు చెందిన ఎల్లస్వామి డబ్బాల నుంచి రెడ్డికాలనీ వైపు వస్తుండగా గోపాల్‌రావు బిల్డింగ్ వద్ద కారు డ్రైవర్ మద్యం మత్తులో అజాగత్రగా నడుపుతూ ద్వికచక్రవాహనదారుడిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడి ఎడమ కాలు విరిగింది. బాధితుడి అల్లుడు దండు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

ధర్మసాగర్, మార్చి 22: అక్రమంగా మట్టిని రవాణాచేస్తున్న టిప్పర్లను ఎస్సై నర్సింగరావు శుక్రవారం పట్టుకున్నారు. నష్కల్‌కు చెందిన కొతుల రాజు, యాకయ్యలు ఎక్స్‌కావేటర్, టిప్పర్లతో వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామ శివారు గట్టుమల్లికార్జున దేవస్థానం నుంచి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి వద్దకు రాగానే పోలీసులు వాహనాలను పట్టుకున్నారు. అనంతరం టిప్పర్లను పీఎస్‌కు తరలించి యజమానులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

రైల్వే కో ఆప్షన్ మెంబర్‌గా రాఘవేందర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న రాఘవేందర్

కాజీపేట, మార్చి 22: సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అనుబంధంగా నడుస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో- ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ల సర్వసభ్య సమావేశం శుక్రవారం సికింద్రాబాద్‌లో జరిగింది. కాజీపేట రైల్వేవిభాగంలో పనిచేస్తున్న దేవులపల్లి రాఘవేందర్‌ను కో ఆప్షన్ డైరెక్టర్‌గా నియమించారు. రాష్ట్ర సంఘం నాయకుల చేతుల మీదుగా రాఘవేందర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు శంకర్‌రావు, పిల్లలమర్రి రవీందర్, షేక్ ఖాజాబాబ, చినుకు స్వామిలకు రాఘవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.



బాబోయ్.. ఎండలు!

● వడగాలులతో జాగ్రత్త ● వేసవిలో ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం ● ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

వరంగల్ మెడికల్, మార్చి 22: ఎండలు బాబోయ్ ఎండలు.. అంటూ జనం బేజారవుతున్నారు. మార్చి మొదటివారం నుంచే మండే ఎండలు ముంచుకొచ్చాయి. ఇక ఏప్రిల్, ఇక మే నెలను తలుచుకుంటే జనం బెంబేలెత్తుతున్నారు. వాతావరణ శాఖ కూడా ఈ ఏడాది ఎండలు దంచనున్నాయని ముందే హెచ్చరించింది. కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు భానుడి ప్రతాపానికి విలవిలలాడుతున్నారు. వడదెబ్బతో ఇప్పటికే మంచాన పడుతున్నారు. ఎండ వేడిమి నుంచి తమను తాము రక్షించుకోవడానికి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వర్గాలు చెబుతున్నాయి.

వడదెబ్బ ఎలా సోకుతుంది?

ఎండ తీవ్ర ఉన్నప్పుడు మనిషి మెదడులో ఉన్న ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్రం దెబ్బతినడం వల్ల, ఎక్కువసేపు ఎండలో ప్రయాణం చేసిన పని చేసిన వడదెబ్బ తగులుతుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత 108 ఫారన్‌హీట్ నుంచి 110 ఫారన్‌హీట్‌ల వరకు పెరుగుతుంది. వడదెబ్బ తగిలిన వారిలో 40శాతం మరణాలు సంభవించే అవకాశం ఉంటుందని వైద్య వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

వడదెబ్బ లక్షణాలు

శరీరం నీరసించి పోవడం, విపరీతమైన దాహం, మూత్ర విసర్జనలో మంట తీవ్ర, చర్మం ఎర్రగా మారి వేడిగా ఉండడం, నీళ్ల విరేచనాలు, తల తిరగడం, మగతగా ఉండి అపస్మారక స్థితికి చేరడం. వాంతులు చేసుకోవడం.

వెంటనే అందించాల్సినవి

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ లేదా గాలి ఉన్న ప్రదేశానికి చేర్చాలి. ఆ తరువాత శరీరంపై ఉన్న దుస్తులు తొలగించి ఐస్ ముక్కలతో చల్లని నీటితో కానీ శరీరం అంతా తుడవాలి. కొబ్బరినీరు, నిమ్మరసం, మజ్జిగ ద్రావణాన్ని తొలగించాలి. అయినా రోగి కోలుకోకపోతే వెంటనే ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ముందస్తు చర్యలు చేపట్టాం..

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు



ఎండలు ముదురుతున్న దృష్ట్యా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, ఆరోగ్య ఉప కేంద్రాల, తన ఆరోగ్య కేంద్రాల సిబ్బందిని అలర్ట్ చేశాం. క్షేత్రస్థాయిలో వడదెబ్బ సోకిన వారి వివరాలు సేకరించేందుకు యంత్రాంగం పూర్తి కార్యాచరణతో ఉంది. పిల్లలు, వృద్ధులు తొందరగా వడదెబ్బ సోకే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. ఆరోగ్య శాఖ కూడా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సెలైన్ బాటిల్స్ సరిపడా నిల్వలు ఉన్నాయి. త్వరలో ప్రత్యేక వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తాం. 108, 104 సేవలు కూడా ముమ్మరం చేస్తాం, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.



ఇసుక అక్రమ రవాణాపై సభ్యుల గరం..గరం

నియంత్రణలో అధికారులు విఫలమంటూ
మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీల ఆగ్రహం



ఇసుక అక్రమ రవాణాపై అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీలు

గార్ల, మార్చి22 : మండలంలోని అధికార పార్టీలకు చెందిన కాంట్రాక్టర్లు, నాయకులు తమ ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయాల్లో చేరువులు వాగులు, పాకాల ఏటిలో అక్రమంగా ఇసుక యథేచ్ఛగా ఇసుక రవాణాచేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీలు తీవ్రంగా స్థాయిలో ఆరోపించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బట్టు నాగరాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశం ప్రారంభంకాగానే తొలుత సీతంపేట ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి, గార్ల ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ నాయక్ మండలపరిధిలోని తిర్లాపురం సమీపంలోని రావిని చేరువు, పాకాల ఏరు, గార్ల పెద్ద చేరువులో జేసీపీల సహాయంతో రాత్రి వేళల్లో యథేచ్ఛగా ఇసుకను తరలిస్తుంటే సంబంధితశాఖ అధికారులు మాముళ్ల మత్తులో ఉన్నారని సభ్యులు సమావేశంలో అధికారులను నిలదీశారు. మండలంలోనిగ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక కుప్పలను సీజ్ చేయాలని సమావేశంలో సభ్యులు పట్టుపట్టారు. అక్రమ ఇసుక రవాణా విషయాన్ని జిల్లా కలెక్టర్, మండల తహసీల్దార్ స్థానిక పోలీసులకు దృష్టికి తీసు పోతానని ఎంపీడీవో మంగమ్మ సభ్యులు హామీ ఇచ్చారు. గతప్రభుత్వ పాలన రాంపురం సమీపంలో పాకాల ఏటిపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన బ్రిడ్జికి నేటికి నిధులు మంజూరు చేయలేదని దీనిపై జిల్లా అధికారులు స్పందించి బ్రిడ్జి నిధులు రాబట్టే విధంగా చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వంతెన నిర్మాణంపై ఎమ్మెల్యే, మంత్రి దృష్టికి తీసుకపోతామని ఎంపీపీ బట్టు నాగరాజు హామీ ఇవ్వడంతో జమావేశం ముగిసింది. ఈ సమావేవంలో పలుశాఖల అధికారులు రాకపోవడంతో సర్వసభ్య సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించి, అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు మాలోత్ వెంకట్‌లాల్, మన్నే పల్లి సుగుణాదేవి, ఫరంగన్ బానోత్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

● అదనపు ఎస్పీ చెన్నయ్య



తొర్రూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్రబలగాలు

తొర్రూరు, మార్చి22 : ప్రజాస్వామ్యంలో ఓటువజ్రాయుధం అని ప్రతీ ఒక్కరు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించు కోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం తొర్రూరులో పాలకేంద్రం నుంచి పట్టణ పురవీధుల్లో కేంద్రబలగాలతో పోలీసు అధికారులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎవరికి భయపడాల్సినఅవసరంలేదని, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, పోలింగ్‌కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎలక్షన్ జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. జిల్లాకు కేంద్ర బలగాలు వచ్చాయని, త్వరలో మరిన్ని బలగాలు వస్తాయన్నారు. కాగా, తొర్రూరు పట్టణంలోని పురవీధుల గుండా చేస్తున్న ర్యాలీని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. డీఎస్పీ సురేష్, మోహన్, సీఐ సంజీవ్, డివిజన్ పరిధిలోని ఎస్సైలు జగదీష్, రాంజీనాయక్ పాల్గొన్నారు.


అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవ్ వాటర్ అక్షరమాలలో కూర్చున్న విద్యార్థులు

'నీటి సంరక్షణ ప్రతిపౌరుడి విధి'

మహబూబాబాద్ రూరల్, మార్చి22 : నీటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కల్లెం వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకునిశుక్రవారం పాఠశాలలో విద్యార్థులు సేవ్ వాటర్ అనే అక్షరమాలలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటిముందు ఇంకుడు గుంత నిర్మించుకోవాలని చెప్పారు. బలాష్టి రమేష్, వెంకన్న, జనార్ధన్, శశిధర్, బలాజీ, యుగేందర్, లింగన్న, వైష్ణవి, అపిత, సందీప్ పాల్గొన్నారు.

● కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ జలదినోత్సవాన్నినిర్వహించారు. విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్ఎం రమేష్‌బాబు, విష్ణువర్ధన్, ఉప్పలయ్య, సోమేశ్వర్, ఝాన్సీ, శ్రీనివాసరావు, తిరుపతి, రాణి, సతీష్, మల్లారెడ్డి, వనజ, శ్రీధర్, శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు.

● చిన్నగూడూరు : జల సంరక్షణ అందరి బాధ్యత అని మరిపెడ ఏరియా మెయిన్ కో-ఆర్డినేటర్ గంధసిరి ఉపేంద్ర అన్నారు. శుక్రవారం ఉగ్గంపల్లిలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా బాల వికాస ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నీటిని పరిరక్షిస్తూ పొదుపుగా వినియోగించకుంటే రాబోవు తరం వారు నీటి సంక్షోభం ఎదుర్కొంటారని తెలిపారు. పాఠశాల హెచ్ఎం శిరీష, ఎంపీటీసీ ఉదయమ్మ కొమురెల్లి, డొంకేన ఉపేంద్ర, వరలక్ష్మి, సరళ, సునీత, రమాదేవి విద్యార్థులు ఉన్నారు.

● దంతాలపల్లి : మండల కేంద్రంలో బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాల వికాస మండల కోఆర్డినేటర్ సుకన్య మాట్లాడుతూ ఉన్నత పాఠశాల విద్యార్థులతో నీటి వినియోగంపై ర్యాలీ ఏర్పాటు చేశామన్నారు. హెచ్ఎం వేణుమాధవ్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రామన్నగూడెం మున్నూరు కాపుసంఘం నూతన కార్యవర్గం

నెల్లికుదురు, మార్చి 22 : రామన్నగూడెం మున్నూరు కాపు సంఘం గ్రామ అధ్యక్షుడిగా కనకం కిష్టయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి పాశం రమేష్ శుక్రవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడిగా గాండ్ల రాజు, సూదం లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కనంకం వీరయ్య, కోశాధికారిగా ఆకుతోటరాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కనకం కిష్టయ్య మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం సమస్యల సాధన కోసం కృషిచేయనున్నట్లు తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపాడు.

ఘనంగా లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణం

ఇనుగుర్తి, మార్చి 22 : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహాస్వామి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సతీమణి విజయ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్తలు సుభాష్‌వసంత్, వేణుగోపాల్, గాయత్రి గ్రానైట్స్ కుటుంబసభ్యులు విజయ, శశిరేఖ, ఇందిర, దేవేందర్, వెంకన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన పాస్టర్ల సంఘం బాధ్యులు..

కేసముద్రం : మహబూబాబాద్‌లో శుక్రవారం ఎమ్మెల్యే మురళీనాయక్‌ను కేసముద్రానికి చెందిన జిల్లా పాస్టర్స్, లేలీడర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి ఆధ్వర్యంలో పాస్టర్లు సన్మానించారు. కేసముద్రంలో ఈనెల 24, 29 తేదీల్లో నిర్వహించే మట్టల ఆదివారం, గుడ్ ఫ్రైడే వేడుకల్లో పాల్గొనాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లెపాక తిమోతి, అప్పాల పేతురు, ఆర్.సామ్యూల్, పి.సంపత్‌కుమార్, బల్లెం మార్క్, బొబ్బిలి వినోద్, బాసికర్ల అనుదీప్, జోసెఫ్‌రెడ్డి, గంజి శ్రీనివాస్‌రెడ్డి, కర్ర నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

'భగత్‌సింగ్ ఆశయాల సాధనకు పోరాడాలి'

మహబూబాబాద్ రూరల్, మార్చి 22 : భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం విద్యార్థి, యువత పోరాడాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు సామ పాపయ్య అన్నారు. మహబూబాబాద్ లోని భట్టు అంజయ్య భవనంలో భగత్ సింగ్ వర్ధంతి పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 23వ తేదీ నుంచి 30 వరకు గ్రామగ్రామాన భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెల్లబోయిన కృష్ణ, శ్రీను, ఉపేందర్, నాగరాజు, బాలాజీ, సాయి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్, ప్రవళిక, హేమంత, మౌనిక, చరిత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి.. కేసు నమోదు

బయ్యారం, మార్చి 22 : పురుగుల మందు సేవించి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి పరిస్థితి విషమంగా మారి మృతి చెందడంతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు పోలీస్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశర్లు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బయ్యారం మండలం నర్సాతండా గ్రామానికి చెందిన భూక్య నాను (41) ఈ నెల 10వ తేదీన ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు నానును చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న నాను పరిస్థితి విషమించి శుక్రవార తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుని భార్య జ్యోతి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా మద్యానికి బానిసైన నాను మనస్థాపంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి వడిగట్టినట్లు తెలుస్తుంది.

మోదీ సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపిస్తాయి

● పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు

గార్ల, మార్చి 22 : భారత దేశ వ్యాప్తంగా నరేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలే తిరిగి మూడవ సారి బీజేపీ పార్టీ గెలిపిస్తాయని బీజేపీ మహబూబాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు యలమంచిలి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గార్ల మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యంకాని హామీలను గుప్పించి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధి కనపర్చడంలేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీలు అమలుపై శ్రద్ధ చూపకుండా వలసలను ప్రోత్సహించే పనిలో పడ్డారని విమర్శించారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నయకుడు విమల్ కుమర్ జైన్, మండల నాయకులు జంపాల శ్రీను, దేవా నాయక్, జశ్వత్ ఠాకుర్, తోడేటి నాగరాజు అజ్మీరా రాము, అజ్మీరా సుమలత, బుచ్చిబాబు, ఇల్లందు పట్టణ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాధవ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● డీఈ విజయ్

కురవి, మార్చి 22 : వేసవిలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండ ముందస్తు చేపట్టాలని డీఈ విజయ్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. కురవిలో శుక్రవారం విద్యుత్ ఇంజనీర్లు, సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. గృహజ్యోతి స్కీం లబ్దిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను గుర్తించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలని, తాగునీటికి విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండ అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీ రమేష్‌బాబు, ఏఈలు శారద, జయప్రకాష్, సబ్‌ఇంజనీర్స్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

'లక్ష్మీనారాయణకు నామినేటెడ్ పదవి ఇవ్వాలి'

నెహ్రూసెంటర్, మార్చి 22 : గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తూ ప్రజలకు సేవలందిస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణకు రాజ్యసభ, ఎమ్మెల్సీ, ఏదైనా ఒక కార్పొరేషన్ పదవుల్లో అవకాశం కల్పించాలని తెలంగాణ పారామిలటరీ వెల్ఫేర్ రాష్ట్ర కోఆర్డినేటర్ తేజావత్ రవీందర్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాఅవసరాల కోసం సుదీర్ఘకాలంగా పోరాడుతున్న వ్యక్తి లక్ష్మీనారాయణ అని, మహబూబాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న వ్యక్తిఅని వివరించారు. రాంబాబు, మంగీలాల్, సురేష్, రాజేష్, వెంకన్న, లాలు, ఉపేందర్ పాల్గొన్నారు.

బాలవికాస ఆధ్వర్యంలో నీటి దినోత్సవం

గూడూరు, మార్చి22 : పొనుగోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలవికాస ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో సేవ్ ది వాటర్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. హెచ్ఎం రజిత, సంపత్, సుధాకర్, లక్ష్మీనారాయణ, యాకయ్య, మున్నా, చంద్రమౌళి, సుధీర్, బాలు, వెంకన్న, మధు, పురుషోత్తం, నర్సింహ, శ్రీను, స్టాలిన్, బిక్షపతి, చంద్రశేఖర్, నవీన్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎస్‌పీ కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కేసముద్రం, మార్చి 22 : కల్వల సమీపంలో ఎస్ఆర్ఎస్‌పీ కాల్వలో శుక్రవారం గుర్తుతెలియని పురుషుడి మృతదేహం ఎగువప్రాంతం నుంచి కొట్టుకు వచ్చినట్లు ఎస్ఐ వంశీధర్ తెలిపారు. ఉదయం అమినాపురం ప్రాంతంలో ఈ మృతదేహంకొంతమందికి కనిపించగా ప్రవాహంలో కొట్టుకుంటూ వెళ్లి కల్వల సమీపంలో నిలిచిపోయింది. మృతదేహం ఆనవాళ్లులేకుండా ఉందని, దాన్ని వెలికి తీసి అక్కడే పోస్టుమార్టం చేయించనున్నట్లు ఎస్ఐ తెలిపారు. విచారణ అనంతరం మరిన్ని వివరాలు తెలుస్తామని ఎస్ఐ వివరించారు.

'టీఏల వేతనాలు మంజూరు చేయండి'

మహబూబాబాద్ రూరల్, మార్చి 22 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో సాంకేతిక సహాయకు (టీఏ)లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు వేతనాలు మంజూరు చేయాలని టీఏలు సంతోష్‌కుమార్, నవీన్‌లు విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం పీడీ పురుషోత్తంకువినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీఏలు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి టీఏలకు వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వెంటనే తమ వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో కిశోర్, రాము, సుధాకర్, నర్సింహులు, రమేష్, మంజుల, రాణి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● సంఘం జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య


సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

మహబూబాబాద్ టౌన్, మార్చి22 : విశ్రాంత ఉద్యోగుల సంఘాల నేతలతో ప్రభుత్వం చర్చలు జరిపి, తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైస.నాగయ్య కోరారు. మహబూబాబాద్‌లో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొలువుదీరిన నూతన ప్రభుత్వం ప్రతినెల ఒకటవతేదీన పెన్షన్లు చెల్లించడం హర్షనీయమన్నారు. ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డీఏలను మంజూరి చేసిపీఆర్సీని ప్రకించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి వలబోజు సోమయ్య, మోహన్‌రావు, రమణయ్య వెంకటేశ్వర్లు, నారాయణ, వెంకటాద్రి, ప్రసాద్, రాజలింగం, సోమయ్య చంద్రయ్య, హనుమంత ప్రసాద్, నాగేందర్, నర్సయ్య, రాంప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎర్త్ అవర్‌ను పాటించండి.. భూమిని పరిరక్షించండి

● జీవవైవిధ్య ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మి

మహబూబాబాద్ టౌన్, మార్చి 22 : జిల్లాలో శనివారం గంటపాటు 'ఎర్త్ అవర్ పాటించండి.. భూమిని పరిరక్షించండి' అని జీవవైవిధ్య ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అన్నమనేని లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కోసమే ఎర్త్‌అవర్ అని చెప్పారు. ఈనెల 23న రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ లైట్లను ఆర్పి, పర్యావరణ పరిరక్షణకు చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. అందరూ ఎర్త్‌అవర్‌లో పాల్గొని, విద్యుత్ ఆదా చేయడంతో పాటు వాతావరణంలో సమతుల్యతను కాపాడుకుందామని చెప్పారు.

సాధించాలనే పట్టుదల ఉంటే ఏదైనా సుసాధ్యమే..

● ప్రముఖ సైకాలజిస్ట్ పరికిపండ్ల అశోక్


బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న పరికిపండ్ల అశోక్

మహబూబాబాద్ టౌన్, మార్చి 22 : లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల, తపన ఉంటే దేనినైనా సుసాధ్యం చేసుకోవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు.మహబూబాబాద్ బాలికోన్నత పాఠశాలలో పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శక్తివంతమైన ఆలోచనలు, నమ్మకాలు, అలవాట్లు, ప్రవర్తనలతో ఉన్న సామాన్యుడు కూడా శక్తివంతంగా మారవచ్చని చెప్పారు. హెచ్ఎం ఆరుద్ర వేంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు గిరిజ, శ్రీవాణి, వసంత, సునీత, విజయ్ కుమార్, సంజీవ, విజయలక్ష్మి, సంధ్యారాణి, సుచిత్ర, రజియా, శ్వేత, కౌసల్య, కిరణ్మయి, వీణా, శ్రీలత, విజయ, పద్మ, జహన పాల్గొన్నారు.

'అమర వీరుల కుటుంబాల సంక్షేమానికి కార్పొరేషన్ ఏది?'

మరిపెడ, మార్చి22 : తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన కుటుంబాల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జర్పుల నరేశ్‌శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని గుర్తు చేశారు. అమరుల కుటుంబాలతో మాట్లాడుతానన్న తన మాటను సీఎం నిలబెట్టుకోవాలన్నారు.

ముగిసిన శ్రీముసలమ్మ మహా జాతర




కొత్తగూడ, మార్చి 22 : మండలంలోని గుంజేడులో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీముసలమ్మ మహాజాతర శుక్రవారం వైభవంగా జరిగింది. శ్రీముసలమ్మ దేవతను దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. సంతానంలేని మహిళలు సంతు(వరం) పట్టారు. జాతర ప్రాంగణంలో బస చేశారు. విందులు ఏర్పాటు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం శ్రీముసలమ్మ దేవత వనప్రవేశం చేయడంతో మహాజాతర ముగిసింది. ఈవో భిక్షమాచారి, పూజారులు తోలెం చిన్ననర్సయ్య, తోలెం వెంకటేశ్వర్లు, తోలెం వెంకన్న, కిరణ్‌కుమార్, రాంబాబు, నవీన్‌కుమార్, అనంతరావు, భక్తులు పాల్గొన్నారు.

వెన్నారంలో విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ


సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు

డోర్నకల్, మార్చి 22 : మండలంలోని వెన్నారంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంతంలో శుక్రవారం విఘ్నేశ్వరస్వామి, నాగేంద్రస్వామి, శివలింగ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ ధర్మకర్తలు మల్లం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు.

మరిపెడ ఫొటోగ్రాఫర్‌కు బంగారు పతకం


ఎస్కేఫకృద్దీన్



మరిపెడ, మార్చి 22 : ఫొటోగ్రఫీలో మనోడు దిట్ట.. ఎలాంటి చిత్రాలనైన తన కెమెరాలో బంధించడంఆయన స్వప్నం. ఇటీవల ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ, పీఎంపీ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో శుక్రవారం బంగారు పతకంసాధించి, ఔరా అనిపించాడు. మరిపెడ మునిసిపాలిటీలోని సమీర్ డిజిటల్ స్టూడియో నిర్వాహక ఫొటోగ్రాఫర్ ఎస్కే.ఫకృద్దీన్ ఎఫ్ఐపీ, పీఎంపీ ఆన్‌లైన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొని సిద్దిపేట జిల్లా కొమురవెల్లి జాతరలోని శివసత్తుల విన్యాసాలను కెమెరాలో బంధించాడు. ఆ ఫొటోలను ఇంటర్నేషనల్ స్థాయి పోటీల్లో చేర్చగా దానికి అంతర్జాతీయ గుర్తింపు పొందడంతో ఫకృద్దీన్‌కు బంగారు పతకం దక్కింది. దీంతో ఆయనను మరిపెడ పట్టణ ప్రజలు, స్థానిక ఫొటోగ్రాఫర్లు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

ఎండలతో జాగ్రత్తగా ఉండాలి

● డాక్టర్ ఫాతిమా

తొర్రూరు రూరల్, మార్చి 22 : ఎండతీవ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వెల్లికట్టె పల్లె దవాఖానా డాక్టర్ ఫాతిమా అన్నారు. తొర్రూరు మండలం వెల్లికట్టె సబ్‌సెంటర్ పరిధిలోని పెద్దమంగ్యాతండా గ్రామ పంచాయతీలో ప్రజలకు బీపీ, షుగర్ తదితర వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పీహెచ్‌సీకి రావడానికి ఇబ్బందిపడే వృద్ధులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎండవేడితో ఇబ్బంది పడకుండా చల్లని పానియాలు, ఓఆర్ఎస్ ద్రావణం, నీరు అధికంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, ఆశా వర్కర్ మౌనిక, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'నీటిని పొదుపుగా వాడుకోవాలి'

పెద్దవంగర, మార్చి 22 : నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకుంటేనే మానవాళికి మనుగడ అని పెద్దవంగర ఉన్నత పాఠశాల హెచ్ఎం బుదారపు శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో నీటి ఆవశ్యకతపై అవగాహన కలిపించి మాట్లాడారు. ఉపాధ్యాయులు రాజలింగం, సదయ్య, తాఖీపాషా, అంజయ్య, యాకన్న, శ్రీధర్, గౌరీశంకర్, విజయ్‌కుమార్, ఫైమా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సహకార పరపతి సంఘ సమావేశం

దంతాలపల్లి, మార్చి 22 : మండల కేంద్రంలో శుక్రవారం ఉమ్మడి నర్సింహులపేట మండల టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘానికి అనుబంధ ఉపాధ్యాయ సహకార పరపతి సంఘం వార్షిక సమావేశానికి సీనియర్ ఉపాధ్యాయుడు సురేందర్ గుప్తా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు, మండల బాధ్యులు, సహకార పరపతి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

తొర్రూరు, మార్చి 22 : విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు పోరాటాలే శరణ్యమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ ఉద్యమ ఆదర్శ నేత అప్పారి వెంకటస్వామి 23వ వర్ధంతి సందర్భంగా డివిజన్ కేంద్రంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ నాయకులు నాగమల్లయ్య, వెంకన్న, నారాయణ, రంజిత్, యాకూబ్, నర్సింహస్వామి, అజయ్, వంశీ, కృష్ణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కష్టపడాలి

పెద్దవంగర, మార్చి 22 : కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి యువకులంతా కష్టపడాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. గురువారం స్థానికంగా వివిధ గ్రామాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అందరు కలసి కష్టపడి పని చేయాలన్నారు. పాలకుర్తి దేవస్థాన డైరెక్టర్ పన్నీరు వేణు, జిల్లా సంయుక్త కార్యదర్శి పూర్ణచందర్, బీసీ సెల్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, వినోద్‌గౌడ్, శ్రీనాథ్, పబ్బతి సంతోష్, సంపత్, ఆయా గ్రామాల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.

వాహనాల ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలి

ఆర్టీవో ఎండీ గౌస్‌పాష

తొర్రూరు రూరల్, మార్చి 22 : వాహనదారులు సరియైన పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని జిల్లా రవాణాశాఖ అధికారి (ఆర్టీవో) ఎండీ గౌస్‌పాష హెచ్చరిం చారు. గురువారం వెల్లికట్టె గ్రామ శివారు పాలకేంద్రం వద్ద వాహనాలను తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతున్న పార్లమెంట్ ఎన్నికల నిబంధనల ప్రకారం వాహనదారులు సరియైన పత్రాలు లేకుండా వాహనాలను నడిపిన, అనుమతిలేకుండా ఏమైన రవాణ చేసినా చర్యలు తీసుకుంటానన్నారు. వాహనదారులు ఖచ్చితంగా వాహన ధ్రువపత్రాలను తమవెంట ఉంచుకోవాలన్నారు.

ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

తొర్రూరు, మార్చి 22 : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తొర్రూరు తహసీల్దార్ బి.వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఓటుహక్కు నమోదు, ఓటు వినియోగం తదితర అంశాలను కూలంకుశంగా వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, ఇంటి పక్కల వారికి, 18 సంవత్సరాలు నిండిన వారందరిని ఓటు హక్కు నమోదు చేసుకోవాల్సిందిగా తెలియజేయాలన్నారు.హెచ్ఎం లక్ష్మీనారాయణ, ఆర్ఐ రాహుల్, బీఎల్‌వోలు విద్యార్థులు పాల్గొన్నారు.

ఈదులపూసపల్లిలో స్వయం పరిపాలన

మహబూబాబాద్ టౌన్, మార్చి 22 : ఈదులపూసపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలను బోధించారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు గోవర్ధన్, వేణుగోపాల్, పద్మ, సత్యనారాయణ, క్రిష్ణవేణి, సువర్ణ, వీణ పాల్గొన్నారు.